





ప్రధానోపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతున్న కమలకుమారి

ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

- పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలి
- డీఈవో కమలకుమారి, సమగ్ర శిక్షా ఏపీసీ మధుసూదనరావు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 7: వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి, సమగ్ర శిక్షా ఏపీసీ ఎ.మధుసూదనరావు సూచించారు. వృత్తి నైపుణ్యాల పెంపుదలకు టీచర్ ప్రొఫిషియన్సీ డెవలప్‌మెంట్ మాడ్యూల్స్‌ను ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించిందన్నారు. సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూలులో బుధవారం హెచ్‌ఎంల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లాగిన్ ఐడీ పొందిన ప్రతి ఉపాధ్యాయుడూ యుద్ధప్రాతిపదికన మూడు మాడ్యూల్స్ పూర్తి చేయాలన్నారు. విద్యాపరంగా అమలవుతున్న ప్రతి కార్యక్రమాన్నీ విజయవంతం చేయాల్సిన బాధ్యత ఎంఈవోలు, హెచ్‌ఎంలపై ఉందన్నారు. మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న దృష్ట్యా హెచ్‌ఎంలు అందరూ విద్యార్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయాలన్నారు. ప్రతి పాఠశాల నూరు శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. సి, డి గ్రేడుల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమగ్ర శిక్షా ఏఎంవో పి.రాంబాబు మాట్లాడుతూ జిల్లాలో లాగిన్ ఐడీలు పొందిన ఉపాధ్యాయులు 1,648 మంది వున్నారన్నారు. అందుకు సంబంధించిన వివరాలను తెలియచేశారు. లీడర్‌షిప్ ఫర్ ఈక్విటీ జిల్లా సమన్వయకర్త ఆషిక్ ఆలీ బేగ్ మాట్లాడుతూ టీపీడీ మాడ్యూల్స్ పూర్తిచేసే విధానంలో ఇబ్బందులు ఎదురైతే 9390299373 నెంబరును సంప్రదించాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్షా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, ప్రత్యామ్నాయ పాఠశాలల సమన్వయకర్త దొండపాటి రమేష్‌బాబు, సీహెచ్ సురేష్, ఎంఈవోలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



సైన్స్ ఫెయిర్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కమలకుమారి

14న అమలాపురంలో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్

- గోడ పత్రికలను ఆవిష్కరించిన జిల్లా విద్యా శాఖాధికారి కమలకుమారి
- 72 ప్రాజెక్టుల ఎంపిక
- విజయవంతానికి పది కమిటీల ఏర్పాటు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 7: సైన్స్ ఫెయిర్లు నూతన ఆవిష్కరణలకు నాంది పలుకుతాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి పేర్కొన్నారు. అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 14న నిర్వహించే ఇన్‌స్పైర్-మనక్ సైన్స్ ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరుతూ రూపొందించిన గోడపత్రికను డీఈవో ఆవిష్కరించారు. సమన్వయ కమిటీ సమావేశాన్ని బుధవారం జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన ఇన్‌స్పైర్ మనక్ సైన్స్ ప్రదర్శనకు ఇప్పటికే ఎంపిక చేసిన 72 ప్రాజెక్టులను తీసుకురావాలన్నారు. వాటికి సంబంధించి ప్రతి విద్యార్థికీ రూ.10వేలు చొప్పున వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్టు సుబ్రహ్మణ్యం తెలిపారు. ప్రదర్శనను విజయవంతం చేసేందుకు 10 కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారులు బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, డి.రమేష్‌బాబు, పి.రాంబాబు, హెచ్‌ఎంలు ఎస్.రాజరాజేశ్వరి, విత్తనాల శ్రీనివాస్, ఎంఈవోలు జి.సూర్యప్రకాశరావు, ఎస్.దుర్గాదేవి, ఎన్.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, పెచ్చెట్టి శ్రీనివాసరావు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



గుర్రపుడెక్కతో నిండిన ప్రధాన పంటకాల్వ

పెంట కాల్వలు

- పంట కాల్వల్లో భారీగా పేరుకుపోయిన గుర్రపుడెక్క
- ఇలాగైతే సాగునీరు ముందుకు సాగేదెలా!
- పత్తాలేని కాంట్రాక్టరు
- నాలుగున్నరేళ్లుగా పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- పలుచోట్ల రైతులే స్వచ్ఛందంగా కాల్వలు బాగుచేసుకంటున్న వైనం

"రైతే రాజు.... అన్నదాతకు పెద్దపీట... రైతులే దేశానికి వెన్నుముక... ఇలా రాజకీయ నాయకులు ఎవరికి నచ్చిన రీతిలో వారు రైతులను వారి రాజకీయ లబ్ధి కోసం వర్ణిస్తుంటారు. కానీ వారే క్షేత్రస్థాయిలో రైతులకు సాగునీరు అందించే పంట కాల్వలను అభివృద్ధి చేయడానికి ముందుకు రావడం లేదు. గడిచిన నాలుగున్నర ఏళ్లలో పంట కాల్వలను కనీసం పట్టించుకోకపోవడంతో నేడు అవి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. గుర్రపుడెక్క తూడు పేరుకుపోయి పంట కాల్వలు కాస్తా పెంట కాల్వలుగా మారిపోయాయి. తూడు, గుర్రపుడెక్క తొలగించడానికి టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ల జాడలేదు. ఏడాదిలో రెండుసార్లు (ఖరీఫ్, రబీ సీజన్లలో)గుర్రపుడెక్క తొలగించాల్సిన కాంట్రాక్టరు పత్తాలేకుండా పోయాడని రైతులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఇక చేసేది లేక ఏదోలా పంట పండించాలనే దృఢ నిశ్చయంతో రైతులే విరాళాలు వేసుకుని పంట కాల్వలను బాగు చేసుకుంటున్నారు."

పి.గన్నవరం, ఫిబ్రవరి 7: కోనసీమ జిల్లావ్యాప్తంగా సుమారు 245 కిలోమీటర్ల మేర పి.గన్నవరం ప్రధాన పంట కాల్వ, అమలాపురం పంట కాల్వ, బ్యాంక్ చానల్, జీఈ మెయిన్ చానల్ ప్రవహిస్తున్నాయి. సుమారు 930 కిలోమీటర్ల మేర చానల్స్, బ్రాంచి చానల్స్ రైతులకు సాగునీరు అందిస్తున్నాయి. ఈ క్రమంలో ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్‌కు ఒక్కసారి, రబీకి ఒక్కసారి పంటకాల్వల్లో తూడు, గుర్రపుడెక్క తొలగించాల్సి వుంది. ఇందుకు జిల్లాలో నలుగురు కాంట్రాక్టర్లు టెండర్లు దక్కించుకున్నట్టు సమాచారం. కానీ ఈ ఏడాది వారు ఖరీఫ్‌లోనే పూర్తిస్థాయిలో గుర్రపుడెక్క తొలగించలేదన్న విమర్శలున్నాయి. ఇప్పుడు రబీకి ప్రధాన పంట కాల్వలతో పాటు ఇతర చానల్స్ పంట కాల్వల్లో సైతం గుర్రపుడెక్క, తూడు తొలగింపు ప్రక్రియను ప్రారంభించ లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగైతే సాగునీరు శివారు పంట పొలాలకు ఎలా అందుతుందని వారు ప్రశ్నిస్తున్నారు. నాలుగేళ్లగా యంత్రాంగం పట్టించుకోకపోవడంతో కాల్వల్లో మట్టి పేరుకుపోయి సాగునీరు ముందుకెళ్లట్లేదని చెప్తున్నారు. పి.గన్నవరం, మామిడికుదురు మండలాల్లో పలు పంట కాల్వలను రైతులే స్వచ్ఛందంగా బాగు చేసుకున్నారు. పి.గన్నవరం మండలంలోని ఆ సుపత్రిచానల్ గట్లు బలహీనంగా ఉండడంతో సాగునీటిని తక్కువగా పంపిస్తున్నారు. దీంతో శివారు ప్రాంతాలకు సాగునీరు పూర్తిస్థాయిలో అందట్లేదని అన్నదాతలు వాపోతున్నారు. ఇదే చానల్ పరిధిలో ముంగండ శివారులో సాగునీరు అందకపోవడంతో సుమారు పది ఎకరాల సాగు భూమిని రెండవ పంటగా అపరాలు వైపు మళ్లించారు. ముంగండ బ్రాంచి చానల్, మానేపల్లి చానళ్లలో గుర్రపుడెక్క, తూడు తప్ప నీరు కనిపించని పరిస్థితి నెలకొంది. పి.గన్నవరం ప్రధాన పంటకాల్వలో ఎన్నడూ లేని విధంగా చెత్తపేరుకుపోయి అధ్వానంగా మారింది. జిల్లాలో అనేకచోట్ల ఇదే పరిస్థితి నెలకొందని సమాచారం. ఖరీఫ్‌లో గుర్రపుడెక్క తొలగించని కాంట్రాక్టరు రబీలో ఎలా తొలగిస్తాడని రైతులు మండిపడుతున్నారు.

కాగా కాంట్రాక్టరుకు ఇరిగేషన్ అధికారులు వత్తాసు పలుకుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. పి.గన్నవరం మండలంలో ఇరిగేషన్ అధికారులకు ఒక సమస్యను చెప్తే అదిగో ఇదిగో అంటూ కాలయాపన చెయ్యడమే తప్ప పట్టించుకున్న దాఖలాలు లేవని బహిరంగంగా విమర్శిస్తున్నారు. సంబంధిత కాంట్రాక్టరుతో ఒక్క కాల్వను కూడా బాగుచేయించలేదని అధికారులపై రైతులు మండిపడుతున్నారు. గతేడాది సాగునీరు అందకపోవడంతో అయిల్ ఇంజన్లు ఏర్పాటు చేస్తే సంబంధిత అధికారి వాటి వివరాలు చెప్పడానికి ముందుకు రాలేదు. దీంతో ఇంజన్లతో ఎంతమేర సాగునీరు అందించారో వివరాలు చెప్పడానికి ఆ అధికారి వెనుకడుగు వెయ్యడం గమనార్హం.



పోతవరం కోకోనట్ కళ్యాణమండపం ఎదుట ముంగండ బ్రాంచ్ చానల్ పంటకాల్వ దుస్థితి



నాగుల్లంక వద్ద మానేపల్లి హెడ్ చానల్ పంటకాల్వ దుస్థితి



ముంగండలో సాగునీరు సరిపడక అపరాల పంట కోసం దుక్కుదున్నుతున్న ట్రాక్టరు



నలభై ఏళ్లుగా సాగు చేశాం నీరందక అపరాల వైపు వెళ్లాం

వాసంశెట్టి త్రిమూర్తులు, కౌలు రైతు, ముంగండ

నలభై ఏళ్లుగా సేద్యం చేస్తున్నా సాగునీటికి ఏనాడూ ఇబ్బంది రాలేదు. పంట కాల్వలో సరిగ్గా నీరు రాకపోవడంతో చాలా కష్టంగా వుంది. అష్టకష్టాలు పడి పంట పండించినా ప్రకృతి కన్నెర్రతో చేతికందలేదు. ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తే రైతులకు చెల్లిస్తాం. రెండో పంట సమయంలో పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా ఈసారి వరిని తప్పించి అపరాలువైపు వెళ్లాం. ఈ అయకట్టులో సుమారు పది ఎకరాలు ఉంది.



మొండిపులంక ఈస్ట్ చానల్‌లో రైతులే స్వచ్ఛందంగా పంట కాల్వను బాగుచేసుకుంటున్న దృశ్యం



నగరంలో రైతులే స్వచ్ఛందంగా కాల్వను బాగుచేయించుకుంటున్న దృశ్యం

జిల్లాలో కొత్తగా 11 ఇసుక రీచ్‌లకు అనుమతి

క్షేత్రస్థాయిలో మరిన్ని రీచ్‌లను గుర్తించాలి: జిల్లా ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక తవ్వకాలకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని సమన్వయ శాఖల అధికారులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. జిల్లాలోని మూడు మండలాల పరిధిలో కొత్తగా ప్రతిపాదించిన 11 రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలకు కమిటీ సభ్యుల అనుమతితో ఆమోద ముద్ర వేశారు. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. గతంలో ఆమోదం పొందిన రీచ్‌లకు గడువు పూర్తయిందీ, లేనిదీ గనులు, భూగర్భ శాఖ అధికారుల ద్వారా ఆరా తీశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆత్రేయపురం మండలం అంకంపాలెం ర్యాంపులో 9.854 హెక్టార్లు, వెలిచేరు-ఎ ర్యాంపులో 24.334 హెక్టార్లు, వెలిచేరు-బి ర్యాంపులో 24.993 హెక్టార్లు, కపిలేశ్వరపురం-ఎ ర్యాంపులో 25.256 హెక్టార్లు, కపిలేశ్వరపురం-బి ర్యాంపులో 26.974 హెక్టార్లు, రావులపాలెం మండలం పొడగట్లపల్లి-ఎర్యాంపులో 24.965 హెక్టార్లు, పొడగట్లపల్లి-బి ర్యాంపులో 22.88 హెక్టార్లు, ఊబలంక-ఎ ర్యాంపులో 46.861 హెక్టార్లు, ఊబలంక-బి ర్యాంపులో 21.986 హెక్టార్లు, వద్దిపర్రు-ఎ ర్యాంపులో 23.975 హెక్టార్లు, వద్దిపర్రు-బి ర్యాంపులో 31.83 హెక్టార్లలో తవ్వకాలకు ఆమోద ముద్ర వేసినట్టు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో కొత్తగా మరిన్ని రీచ్‌లను గుర్తించేందుకు సమన్వయ శాఖల అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటనలు జరపాలన్నారు. ఆమోదం పొందిన ర్యాంపుల వద్ద రెవెన్యూ అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. గనులు, భూగర్భ శాఖ జిల్లా అధికారి ఎస్.సాయిరామ్‌సింగ్ మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన ఇసుక రీచ్‌లు అన్నింటికీ చట్టబద్ధమైన పర్యావరణ, కాలుష్య నియంత్రణ, ఇసుక తవ్వకాలకు సంబంధించి అనుమతులు పొందాలన్నారు. ఇ-టెండర్ల విధానం ద్వారా రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇస్తామన్నారు. గోదావరి హెడ్‌వర్క్స్ ఇంజనీర్లు, తహసీల్దార్లు ఆయా రీచ్‌లకు సంబంధించి ఎటువంటి అభ్యంతరాలు లేవని సర్టిఫికెట్లు ఇస్తారన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, జిల్లా అడ్మిన్ ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, రామచంద్రపురం ఆర్డీవో ఎస్.సుధాసాగర్, గోదావరి హెడ్‌వర్క్స్ ఈఈ కాశీవిశ్వేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి వి.కృష్ణకుమారి, ఆర్డీవో డీఏ ప్రతాప్‌రావు, డీఎస్పీ రమణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ సీహెచ్‌ఎన్వీ కృష్ణారెడ్డి, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

'ఎన్నికల విధులు నిబంధనల ప్రకారం నిర్వర్తించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సత్యనారాయణ

కొత్తపేట, ఫిబ్రవరి 7: ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది కమిషన్ నిబంధనల ప్రకారం పనిచేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని కొత్తపేట ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం ఆయన తహసీల్దార్లు, డేటా ఆపరేటర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల అనంతరం కొత్త ఓటర్లకు సంబంధించి నిబంధనలను రాజకీయ పార్టీ ప్రతినిధులకు తెలియజేశారు. వారి అనుమానాలను నివృత్తి చేశారు. ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కొత్త ఓటర్లకు సంబంధించిన సంఖ్యను, వివరాలను తమకు అందించాలని, పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్ సదుపాయం, సమస్యాత్మక కేంద్రాల వద్ద పోలీసు సిబ్బందిని పెంచాలని, దివ్యాంగులకు, వృద్ధులకు ఓటింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు.

సమావేశంలో టీడీపీ, బీజేపీ, జనసేన, కాంగ్రెస్, బీఎస్పీ, సీపీఐ ప్రతినిధులు ముత్యాల బాబ్జీ, కంఠంశెట్టి చంటి, పాలూరి సత్యానందం, పల్లి హరిశ్చంద్రప్రసాద్, సాకా రాజారావు, కె.నరసింహమూర్తి, కాంద్రేగుల నరసింహం, పల్లి ఏసు తదితరులు పాల్గొన్నారు.



ఆత్రేయపురం పోలీస్ స్టేషన్ ఆవరణలో నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు

ఎక్కడికక్కడ ఆశా వర్కర్ల నిర్బంధం

పోలీస్ స్టేషన్లకు తరలింపు

నేడు విధులకు హాజరు కావాలని డీఎంహెచ్‌వో ఉత్తర్వులు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 7: రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆశా వర్కర్ల 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ పోలీసులు ఆశా వర్కర్లను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు. దీంతో వారు తమను అక్రమంగా నిర్బంధించారంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మరోవైపు తెలుగుదేశం పార్టీ నేతలు పోలీస్ స్టేషన్ల వద్దకు వెళ్లి ఆశా వర్కర్లకు సంఘీభావం తెలిపారు. ఇదిలా వుండగా ఉన్నతాధికారుల ఆదేశాలను వివరిస్తూ ఆశా వర్కర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ గురువారం విధులకు హాజరు కావాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర ఉత్తర్వులు ఇచ్చారు.

...వివరాలు 8లో



రావులపాలెంలో ఆశా వర్కర్లకు సంఘీభావం తెలుపుతున్న టీడీపీ నేతలు

ఇంటర్ పరీక్షలు

ప్రశాంతంగా నిర్వహించాలి

అధికారులతో సమావేశమైన డీఆర్వో నరసింహులు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పగడ్బందీగా నిర్వహించడానికి పూర్తి సమన్వయంతో అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని డీఆర్వో నరసింహులు ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలు మూడు దశల్లో జరుగుతాయన్నారు. మార్చి 1 నుంచి 20 వరకూ ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకూ పరీక్షలు ఉంటాయన్నారు. జిల్లాలో మొత్తం 52 పరీక్షా కేంద్రాల్లో 19,336 మంది మొదటి ఏడాది, 18,166 మంది రెండో ఏడాది పరీక్షలకు హాజరవుతారన్నారు. ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 3,802 మంది పరీక్షలు రాస్తారన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేస్తామన్నారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వం ద్వారా జారీ అయిన ఏదో ఒక గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకెళ్లాలన్నారు. విద్యుత్ నిరంతరాయంగా ఉండాలని, జనరేటర్లను కూడా సిద్ధం చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, మెడిసిన్స్, అత్యవసర సదుపాయాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు కంప్యూటర్, జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలన్నారు. పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా ఆయా మార్గాల్లో ఆర్టీసీ బస్సుల వేళలను మార్పు చేసుకోవాలని సూచించారు. ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, మొబైల్ ఫోన్లు, కాలిక్యులేటర్లు, ఐప్యాడ్, బ్లూటూత్, పేజర్ లేదా ఇంటరాక్ట్



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహులు

ప్రోగ్రామింగ్ చేసే ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఉండదని, అందువల్ల వాటిని విద్యార్థులు తీసుకురావద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐవో ఎన్ఎస్‌వీఎల్ నరసింహం, జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు, ఆర్టీసీ ఏఎం ఎం.అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో శోభాయాత్ర

ప్రత్యేక పూజల నిర్వహణ

కొవ్వూరు, ఫిబ్రవరి 7 : త్రిదండి స్వామీజీ శ్రీశ్రీ మద్భక్తి సుధీర దామోదర మహరాజు ద్వితీయ వార్షిక విరహ మహోత్సవాలను పురస్కరించుకుని కొవ్వూరు గౌడీయామఠం స్వామీజీ శ్రీమద్భక్తి విబుధ వామన మహరాజు ఆధ్వర్యంలో బుధవారం శోభాయాత్ర నిర్వహించారు. కొవ్వూరు లాంచీల రేవు వద్ద ఉన్న శ్రీ రామానంద గౌడీయామఠంలో రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణ వీధులలో శ్రీమద్భక్తి విబుధ వామన మహరాజు ఆధ్వర్యంలో 108 కలశాలతో నగర సంకీర్తన, శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా



శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న స్వామీజీ

శ్రీమద్భక్తి విబుధ వామన మహరాజు మాట్లాడుతూ ఈనెల 7నుంచి 13వ తేదీ వరకు గౌడీయామఠంలో భాగవత సప్తాహములు, త్రిదండి స్వామీజీ శ్రీశ్రీ మద్భక్తి సుధీర దామోదర మహరాజు తిరోభావము, శ్రీశ్రీకృష్ణవసంత పంచమి, శ్రీవిష్ణుప్రియ ఆవిర్భావం, శ్రీల పుండరీక విద్యానిధి, శ్రీల రఘునందన ఠాకూరుల ఆవిర్భావములను పురస్కరించుకుని ప్రత్యేక హోమాలు, అభిషేకాలు, పూజలు, నైవేద్యాలు, ప్రసాద వితరణ జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో శ్రీపాద భక్తిప్రమోద జనార్ధన మహరాజు, శ్రీపాద రమణ కృష్ణదాస్ పాల్గొన్నారు.

144 అడుగుల ఆంజనేయ

విగ్రహ స్థాపనకు భూమిపూజ



భూమిపూజ నిర్వహిస్తున్న శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ

రాజానగరం, ఫిబ్రవరి 7: జాతీయ రహదారిని ఆనుకుని వెలుగుబంద పరిధిలోని దత్త ఆశ్రమం ప్రాంగణంలో రూ.10 కోట్లతో నెలకొల్పనున్న 144 అడుగుల బృహదాకార కార్యసిద్ధి శ్రీఅంజనేయస్వామి వారి విగ్రహ స్థాపనకు మైసూరు దత్తపీఠాధీశులు శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ బుధవారం భూమిపూజ చేశారు. మహావీర్ హనుమాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విగ్రహ నిర్మాణం చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దీనిలో భాగంగా తొలుత వాస్తు పూజ, విశ్వ దేవత హోమం, భూమిపూజ క్రతువులు వేదమంత్రోచ్ఛరణ మధ్య వైభవంగా నిర్వహించారు. జైశ్రీరామ్, జైశ్రీరామ్ నినాదాలతో ఆశ్రమ ప్రాంగణం మార్మోగింది. గణపతి హోమం, వాస్తు హోమం, మన్యుసూక్త సహిత రామతారక హోమం చేపట్టారు. అనంతరం బృహదాకార హనుమ విగ్రహ శంకుస్థాపన మహోత్సవ క్రతువును కన్నుల పండువగా నిర్వహించారు. పాతాళంలో సూక్ష్మ ఆంజనేయ, మధ్యలో చిన్న ఆంజనేయస్వామి విగ్రహాలు కూడా విరాట్ ఆంజనేయ స్వామి విగ్రహం చెంతన రూపుదిద్దుకోనున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఈ నెల 18న కోరుకొండ లక్ష్మీ నరసింహస్వామి క్షేత్ర అభివృద్ధిలో భాగంగా రంగనాథస్వామి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమాన్ని చిన జీయర్ స్వామివారి చేతుల మీదుగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాహితీవేత్త ఎర్రా ప్రగడ రామకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ షర్మిలారెడ్డి, ఇన్నమూరి దీప్తి, తోట సుబ్బారావు, గూడూరి రాధిక, అశ్విన్ జవార్, పంతం కొండలరావు, కేఎల్ఎన్ రెడ్డి, మేడి త్రిమూర్తులు, లంక సత్యనారాయణ, వీరబాబు, రామరాజు, వైసీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, మండారపు వీర్రాజు, ఇలపకుర్తి కామేశ్వరరావు, సోడసాని తాతబ్బాయి, సీతానగరం ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లు, పురుగుల నివారణకు రసాయనాల వాడకం హానికరం

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 7: కొబ్బరి చెట్లను ఆశించే తెగుళ్లు, పురుగుల నివారణకు రసాయనాల వాడకం హానికరమని, జీవ నియంత్రణ విధానాలే క్షేమదాయకమని అఖిల భారత కొబ్బరి సమన్వయ పథకం జీవ నియంత్రణ విభాగం (బెంగళూరు) నోడల్ అధికారి పి.శివకుమార్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం సన్నవిల్లిలో సర్పంచ్ చిక్కం జంగమయ్య అధ్యక్షతన బుధవారం జరిగిన కొబ్బరి రైతుల సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొబ్బరి చెట్లను నల్లముట్టి పురుగు ఆశించడంతో ఆదాయం కోల్పోయిన సన్నవిల్లి రైతులను ఆదుకునేందుకు అంబాజీపేట కొబ్బరి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు నోడల్ అధికారిని రప్పించి పరిస్థితిని ప్రత్యక్షంగా చూపించారు. శివకుమార్ మాట్లాడుతూ అవసరాన్ని అనుసరించి బ్రాకాన్ బ్రెవికార్నిస్, గోనియోజస్ నెఫాంటిడిస్ మిత్ర పురుగులను ప్రయోగించడం ద్వారా నల్లముట్టిని తుదముట్టించవచ్చన్నారు. అయితే బదనికకు కనీసం రూపాయి వంతున ఎకరాకు రూ.300 రైతులు



రైతు సదస్సులో మాట్లాడుతున్న శివకుమార్

వాటాగా చెల్లిస్తే బదనికల సరఫరా సాధ్యపడుతుందని కొబ్బరి పరిశోధనా కేంద్రం ప్రిన్సిపల్ సెంటిస్ట్ ఎన్‌బీవీ చలపతిరావు చెప్పారు. దేశంలోని అన్ని ప్రాంతాలకు అంబాజీపేట పరిశోధనా కేంద్రం నుంచే మిత్ర పురుగులను పంపిణీ చేస్తామన్నారు. అందరూ చిన్నకారు రైతులేనని, ఉచితంగా బదనికలు ఇవ్వాలని సర్పంచ్ జంగమయ్య కోరారు. ఇందుకోసం అంబాజీపేట కేంద్రానికి ఆర్థిక వనరులు సమకూర్చాలని నోడల్ అధికారి శివకుమార్‌ను సర్పంచ్ అభ్యర్థించారు. తన వంతు ప్రయత్నిస్తానని శివకుమార్ భరోసా ఇచ్చారు. నల్లముట్టి పురుగు వ్యాప్తి, లక్షణాలు, సామూహిక నివారణ పద్ధతులపై ఎంటమాలజిస్టు వి.అనూష రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం శివకుమార్‌తో పాటు శాస్త్రవేత్తలు కొబ్బరి చెట్లపై మిత్ర పురుగులను ఎలా వదలాలో రైతులకు ప్రయోగాత్మకంగా చూపించారు. సదస్సులో ఎంపీటీసీ వంగా గిరిజానాగకుమారి, చిక్కం నాగబాబు, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి టీవీ రమణ, ప్లాంట్ పేథాలజీ సైంటిస్టు బి.నీరజ, ఉద్యానవన శాఖాధికారిణి ఎం.శైలజ, మాజీ సర్పంచ్ గనిశెట్టి వీరాస్వామినాయుడు, గనిశెట్టి సద్గురురావు, నిమ్మకాయల రాము పాల్గొన్నారు.

భీష్మ ఏకాదశి ఏర్పాట్లపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న ఈవో రామచంద్రమోహన్

అన్నవరం, ఫిబ్రవరి 7: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధికి ఈనెల 20న భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా అసంఖ్యాకంగా విచ్చేసే భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, వైదిక కార్యక్రమాల నిర్వహణపై బుధవారం ఈవో రామచంద్రమోహన్ వైదిక కమిటీ సభ్యులు, ఏఈవోలు, సూపరింటెండెంట్‌లతో సమావేశమయ్యారు. సుమారు లక్ష మంది విచ్చేస్తారని, 15 వేల వ్రతాలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు. దీనికనుగుణంగా రెండుగంటల నుంచి వ్రతాలు, మూడు గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించాలని నిర్ణయించారు. భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్యూలైన్ వ్యవస్థ పటిష్టంగా ఉండాలని భక్తులకు పులిహోర, దద్యోజనం ప్రసాదాన్ని ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రదానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి నరసింహమూర్తి, ఏఈవోలు కృష్ణారావు, జగ్గారావు, సూపరింటెండెంట్‌లు కృష్ణప్రసాద్, కంచి మూర్తి, బలువు సత్యశ్రీనివాస్, ఇంజనీరింగ్ అధికారులు బాలమురళీ, నరసింహారెడ్డి, టీఎస్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న లారీ

భార్య మృతి..భర్తకు తీవ్రగాయాలు

పిఠాపురం, ఫిబ్రవరి 7: కాకినాడ జిల్లా పిఠాపురం బైపాస్‌రోడ్డులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మరణించగా, భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. కొత్తపల్లి మండలం కొత్తమూలపేటకు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు చిందాడ నాగేశ్వరరావు తన భార్య అపర్ణ(40)కు అనారోగ్యంగా ఉండటంతో కాకినాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స చేయించుకుని మోటార్‌సైకిల్‌పై తిరిగి ఇంటికి బయలుదేరారు. పిఠాపురం పాదగయ క్షేత్రం వద్ద మలుపు తిరుగుతుండగా కాకినాడ నుంచి కత్తిపూడి వైపు వెళుతున్న లారీ వేగంగా ఢీకొట్టింది. మోటార్‌సైకిల్‌ను 50 అడుగుల దూరం ఈడ్చుకువెళ్లింది. ప్రమాదంలో అపర్ణ అక్కడికక్కడే మరణించగా, నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. నాగేశ్వరరావును పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిఠాపురం పట్టణ ఎస్ఐ మురళీమోహన్, హైవే మొబైల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.



బైక్‌ను ఢీకొన్న లారీ



అపర్ణ(ఫైల్ ఫోటో)

50 ఏళ్ల తర్వాత

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 7: ఐదు దశాబ్దాల క్రితం అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్న విద్యార్థులంతా బుధవారం స్వర్ణోత్సవ సంబరాలు జరుపుకున్నారు. 1974లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలతో పాటు విదేశాల్లో స్థిరపడ్డారు. వీరంతా తాము చదువుకున్న పాఠశాల ప్రాంగణంలో ఆటపాటలతో రోజంతా ఆనందోత్సాహాలతో గడిపారు. చిన్ననాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. డాక్టర్ డి.రామచంద్రరావు స్వగృహం వద్ద నిర్మించిన సాంస్కృతిక కళా వేదికపై ప్రదర్శనలు నిర్వహించి సందడి చేశారు. కామాక్షి ప్రేమ మందిరం, స్థానిక అంధుల పాఠశాలలో విద్యార్థులకు తమ వంతు సాయం అందించారు. అదే బ్యాచ్‌కు చెందిన చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ కొత్తూరి శ్రీమన్నారాయణ వృద్ధాప్యం లో పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలను వివరించారు. సాయంత్రం భారమైన హృదయాలతో వీడ్కోలు చెప్పుకున్నారు. కార్యక్రమాన్ని నడిపించిన పూర్వ విద్యార్థులు శిష్టా రామగోపాలం, డాక్టర్ దుంగా వెంకట్, మహ్మద్ ఆజామ్, కర్రా రామకృష్ణ, పెమ్మరాజు విజయ్, పి.రమణ, మంగిపూడి ప్రసాద్, భువనేశ్వరిను ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి ఏటా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు తీర్మానించారు.

రేషన్ బియ్యం పట్టివేత

బిక్కవోలు, ఫిబ్రవరి 7: బిక్కవోలు గ్రామంలో బుధవారం రాత్రి విజిలెన్స్ అధికారులు ఆటోలో తరలిస్తున్న 600 కిలోల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎస్పీ కెఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ బియ్యాన్ని గ్రామంలోని చలపతి ప్రసాద్, ఇంటి రాంబాబు కిలో రూ.20లకు కొనుగోలు చేసి తమ చేపల చెరువుల్లో దాణాకు వినియోగిస్తున్నారన్నారు. ఈ బియ్యం విలువ రూ. 2.27 లక్షలు ఉంటుందన్నారు. సివిల్ సప్లయ్స్ అధికారులు ఆటోను సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేసి సదరు వాహనం యజమాని, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయుటకు బిక్కవోలు పోలీస్ స్టేషన్‌కు సిఫార్సు చేశారన్నారు. కార్యక్రమంలో డీటీ కృష్ణ, హెడ్ కానిస్టేబుల్ శివకుమార్, రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులు పాల్గొన్నారు.

12న అప్రెంటీస్ మేళా

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 7: కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో వివిధ కంపెనీల్లో అప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేయడానికి కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 12న ఉదయం ఐటీఐ పాస్ అయిన విద్యార్థులకు ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటీస్ మేళా 2024 నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వర్మ తెలిపారు. గవర్నమెంట్ ఐటీఐ, ప్రైవేటు ఐటీఐలలో వివిధ ట్రేడ్స్‌లలో ట్రైనింగ్ కంప్లీట్ చేసిన ఎన్‌టీసీ సర్టిఫికెట్ కలిగిన విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. వివరాలకు ఫోన్ నెంబర్ 8639230775 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

లోక్ అదాలత్‌లో అత్యధిక ఎక్సైజ్ కేసులు పరిష్కారమవ్వాలి

ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయాధికారి సునీత



సమావేశంలో మాట్లాడుతున్న సునీత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మార్చి 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన ఎక్సైజ్ కేసులు పెద్ద సంఖ్యలో పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గంధం సునీత ఆదేశించారు. ఈ మేరకు తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న ఎక్సైజ్ కేసుల జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలని సూచించారు. సమావేశంలో తూర్పు గోదావరి సెబ్ అడిషనల్ ఎస్పీ పి.సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

రంపచోడవరం, ఫిబ్రవరి 7: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సెక్టార్, బూత్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టరు మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో విద్యుత్, మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించాలన్నారు. సెక్టారు అధికారులు తరచూ పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు ఎ.కృష్ణజ్యోతి, డీటీ ఎన్‌వీవీ సత్యనారాయణ, బి.రాజు, సీనియర్ అసిస్టెంట్లు ఇందిరాబాయి, లక్ష్మణ్, చెల్లాయమ్మ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎడ్ల బండిని ఢీకొన్న ఆటో

ఆటో డ్రైవర్ దుర్మరణం

కొవ్వూరు, ఫిబ్రవరి 7 : కుక్కను తప్పించబోయి ఎడ్ల బండిని ఢీకొని ఆటో డ్రైవర్ మృతిచెందినట్టు కొవ్వూరు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. చాగల్లు మండలం మల్లవరం గ్రామానికి చెందిన మల్లిన సత్యనారాయణ (45) ప్రతిరోజు మల్లవరం నుంచి రాజమహేంద్రవరం సర్వీస్ ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ప్రతిరోజు మాదిరిగా ఈ నెల 6వ తేదీన సత్యనారాయణ రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో కొవ్వూరు మండలం వేములూరు సాయిబాబా గుడి సమీపానికి వచ్చేసరికి అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి ఆటోతో ఎదురుగా వస్తున్న ఎడ్ల బండిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్ సత్యనారాయణకు ఎడ్లబండి కాడ తలకు తగలడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్టు ధ్రువీకరించారు. సత్యనారాయణ భార్య పద్మ ఫిర్యాదుపై కేసునమోదు చేసినట్టు సీఐ జగదీశ్వరరావు తెలిపారు. సత్యనారాయణకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రాయుడుపాలెంలో వివాహిత అనుమానాస్పద మృతి

భర్తే చంపేశాడని తల్లిదండ్రుల ఆరోపణ

అరెస్టు చేయాలంటూ జీజీహెచ్ వద్ద ఆందోళన

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 7: కాకినాడ రూరల్ మండలం రాయుడుపాలానికి చెందిన వివాహిత బొండాడ హారికాలక్ష్మి (23) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ప్రేమించి పెళ్లి చేసుకుని, అదనపు కట్నం కోసం వేధిస్తూ, చివరకు కట్టుకున్న భార్యను పీకకు ఉరేసి చంపేసి ఆత్మహత్యగా భర్త చిత్రీకరించాడని హారిక తల్లిదండ్రులు గొర్ల రాజు,మణి ఆరోపించారు. తక్షణమే అల్లుడిని అరెస్ట్ చేసి న్యాయం చేయాలని జీజీహెచ్ వద్ద ఆందోళన చేపట్టారు. రాయుడుపాలెం, పిఠాపురానికి చెందిన బొండాడ జాషువ, హారిక ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వివాహం జరిగిన కొద్దిరోజుల నుంచి అదనపు కట్నం కోసం భార్యను జాషువా వేధింపులకు గురి చేసేవాడు. ఈ క్రమంలో ఈనెల 5వ తేదీన ఉదయం 9.30 గంటల సమయంలో హారిక స్నానం చేయడానికి వెళ్లగా కరెంట్ షాక్ తగిలి చేతులు మెడ, కాలిపోయిందని, ఆసుపత్రికి తీసుకెళుతున్నట్లు హారిక తల్లిదండ్రులకు జాషువ సమాచారం అందించి, జీజీహెచ్‌కు తీసుకెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు సోమవారం సాయంత్రం హారిక మృతి చెందింది. అదనపు కట్న కోసం కావాలనే తమ కుమార్తె మెడకు ఉరేసి, చేతులు కాల్చివేసి కరెంట్ షాక్ నెపంతో తమ అల్లుడు హత్యకు పాల్పడి నాటకం ఆడుతున్నాడని హారిక తల్లిదండ్రులు ఆరోపించారు. బుధవారం జీజీహెచ్ మార్చురీ వద్ద ఆందోళన చేశారు. అరెస్ట్ చేసే వరకు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు అనుమతించడం కుదరదంటూ పోలీసులకు చెప్పారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సర్పవరం ఎస్ఐ పి.శ్రీనివాస్ తెలిపారు.



ఊయలలో లేగదూడను ఉంచి పండుగ చేస్తున్న దృశ్యం

లేగదూడకు ఊయల వేడుక

పెరవలి, ఫిబ్రవరి 7: పెరవలి మండలం ముక్కామలకు చెందిన అఖండ వెంకటేశ్వరరావు గోవులను ఎంతో అల్లారుముద్దుగా పెంచుకుంటారు. దీంతో ఆయన వద్ద ఉన్న ఆవుకు ఒక దూడ కూడా పుట్టింది. ఈ మేరకు 21వ రోజున ఉయ్యాల వేడుకను ఘనంగా నిర్వహించారు.శాస్త్రోత్తంగా ఊయల ఏర్పాటు చేసి పూలతో అలంకరించి ఆ ఊయాల్లో దూడను ఉంచి ఎంతో ఆనందంగా వేడుకలు జరిపారు. బంధువులు తరలివచ్చి ఆశీర్వదించారు.

వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.1.68 లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 7: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని బుధవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,68,544 లభించినట్టు ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

మద్యం షాపు తరలించాలని ధర్నా

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 7: పట్టణంలోని 14వ వార్డు పరిధిలో శ్రీరాంపురంలో ప్రభుత్వ మద్యం దుకాణాన్ని తరలించాలంటూ స్థానిక మహిళలతో కలిసి టీడీపీ, జనసేన నాయకులు రెండో రోజైన బుధవారం ధర్నా కొనసాగించారు. ప్రభుత్వ మద్యం దుకాణం వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆ ప్రాంత ప్రజలు వివరించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మాజీ కౌన్సిలర్ వాసంశెట్టి సత్యం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, మాకిరెడ్డి వీఎన్ఎస్ పూర్ణిమ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు. ఎక్సైజ్ అధికారులతో పాటు పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడకు చేరుకుని వారితో చర్చలు జరిపారు. త్వరలోనే షాపును అక్కడి నుంచి తరలిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.



'చేగొండి' మృతికి సంతాపం

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 7: బండారులంక గ్రామ కార్యదర్శి చేగొండి సత్యనారాయణమూర్తి కుటుంబ సభ్యులను బుధవారం పలువురు పరామర్శించారు. ఆయన చిత్రపటానికి ఎంపీడీవో జె.వెంకటేశ్వరరావు,ఈవో పీఆర్డీ జి.మల్లికార్జునరావు నివాళులర్పించారు. కార్యదర్శుల సంఘ జిల్లా ప్రతినిధులు రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు, ఏఎస్వీఎస్ రాజేశ్వరరావు (రాజా), బి.ఆదిశంకరం, బొట్టా నాగేశ్వరావు, రెడ్డి శిరీష,పి.ధనలక్ష్మి, కట్టా సత్యబాబ్, బుజ్జిరాజు, పరంశెట్టి ఆదినారాయణ, పరంశెట్టి శ్రీనివాస్‌పాల్గొన్నారు.

- డిమాండ్ల సాధనకు చలో విజయవాడ వెళ్తున్న ఆశా వర్కర్లను అడ్డుకున్న పోలీసులు
- పోలీసుస్టేషన్లలో నిర్బంధం

ఆశా వర్కర్ల అక్రమ నిర్బంధం





అంబాజీపేట: కల్యాణ మండపంలో ఆశావర్కర్ల నిర్బంధం, మామిడికుదురు: నగరం పీహెచ్‌సీ ఎదుట నినాదాలు చేస్తున్న ఆశ కార్యకర్తలు, కొత్తపేట: ఆశావర్కర్లకు టీడీపీ నాయకుల సంఘీభావం

అంబాజీపేట, ఫిబ్రవరి7: డిమాండ్లు పరిష్కరించాలని చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న ఆశావర్కర్లను అరెస్టులు చేయడం దారుణమని ఆశావర్కర్ల సంఘం నాయకురాలు బీర ఎస్తేరురాణి, ఈతకోట మేరీప్రమీ అన్నారు. రెండురోజుల ముందు నుంచి పోలీసులు గృహ నిర్బంధించారన్నారు. బుధవారం చలో అసెంబ్లీకి వెళ్తున్న 50మంది ఆశావర్కర్లను ఎస్ఐ కె.చిరంజీవి ఆధ్వర్యంలో సచివాలయ మహిళా పోలీసులు, సిబ్బంది అదుపులోకి తీసుకుని స్థానిక పెద్దవీధిలోని కల్యాణ మండపంలోఉంచారు. రాత్రి9గంటలకు ఆశా వర్కర్లను విడిచిపెట్టారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జిగిడ్డి సత్యనారాయణ, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి, నాయకులు నాగాబత్తుల వెంకటసుబ్బారావు, టీడీపీ, జనసేన నాయకులు ఆశావర్కర్లకు సంఘీభావం తెలిపారు. ఆశావర్కర్లు ఎన్.వరలక్ష్మి, బి.స్వరూపరాణి, సీహెచ్.సుందరీకుమారి, ఎన్.రాజేశ్వరి, సీహెచ్.వసంత ఉన్నారు.

రావులపాలెం: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ విజయవాడ బయల్దేరుతున్న ఆశా వర్కర్లను ముందస్తుగా నిర్బంధించడం హేయమైన చర్య అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. 'చలో అమరావతి'లో పాల్గొనేందుకు సిద్ధమైన ఆశా వర్కర్లను పోలీసులు గోపాలపురంలోని కాపు కల్యాణ మండపంలో నిర్బంధించారు. విషయం తెలుసుకున్న సత్యానందరావు టీడీపీ శ్రేణులతో అక్కడికి చేరుకుని అక్రమ నిర్బంధాన్ని తప్పుపట్టారు. ఆశా వర్కర్లకు తమ పార్టీ అండగా ఉంటుందన్నారు. తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్ రాజు, గుత్తుల పట్టాభిరామారావు, కాసురెడ్డి, అధికారి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కొత్తపేట: 'చలోఅమరావతి'లో భాగస్వామయ్యేందుకు వానపల్లి పీహెచ్‌సీ వద్ద సమావేశం నిర్వహిస్తున్న సమయంలో కొత్తపేట పోలీసులు ఆశా వర్కర్లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు స్టేషన్ వద్దకు వచ్చి ఆశా వర్కర్లకు సంఘీభావం తెలిపి వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు కంఠంశెట్టి శ్రీను, ముత్యాల బాబ్జీ, వాసంశెట్టి సత్యనారాయణ, అద్దంకి చంటిబాబు, పల్లి ఏసు, బూసి విష్ణుమూర్తి, అన్యం మునేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలమూరు:విజయవాడ వెళ్లడానికి సిద్ధమవుతున్న 47 మంది ఆశా వర్కర్లను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. తమను ధర్నాకు వెళ్లనీయకుండా అడ్డుకోవడంతో వారు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మొండివైఖరితో వ్యవహరించడం సరైన విధానం కాదన్నారు. కాగా ఆశా వర్కర్లకు టీడీపీ నాయకులు ఈదల నల్లబాబు, సలాది నాగేశ్వరరావు, తాడి శ్రీనివాసరెడ్డి, ఈదల రాంబాబు, చీపురుపల్లి గణేష్, కేతా రాంబాబు, నెల్లి చిన్న, మనేపల్లి శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు.

పి.గన్నవరం: సమస్యలు సాధనకు చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తున్న 21మంది అశవర్కర్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ అనంతరం వారిలో 13మందిని నాగుల్లంక పీహెచ్‌సీ తరలించగా మరో 8మందిని హౌస్‌అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మలికిపురం: చలో విజయవాడకు వెళ్లకుండా మోరి పీహెచ్‌సీ వద్ద 32మంది ఆశావర్కర్లను పోలీసులు నిర్బంధించారు. హక్కుల కోసం పోరాడే వారిపై ఈవిధమైన దమనకాండలు సరికాదని మానవ హక్కుల వేదిక ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాసరావు అన్నారు. అరెస్టు చేసిన ఆశ వర్కర్లను విడిచిపెట్టాలని డిమాండు చేశారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో ఎం.పుష్పకుమారి, సురేఖ, అమ్మాజీ తదితరులు ఉన్నట్టు ఆయన చెప్పారు.

మామిడికుదురు: చలో విజయవాడకు వెళ్లకుండా ఆశ కార్యకర్తలను పోలీసులు బుధవారం నగరం పీహెచ్‌సీ వద్ద నిర్బంధించారు.విధి నిర్వహణకు వస్తే పోలీసులు తమకు నోటీసులు ఇచ్చి నిర్బంధించడాన్ని నిరసిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డిమాండ్లు పరిష్కరించాలంటే ప్రభుత్వం అణచివేసే ధోరణిలో ప్రవర్తిస్తుందని ఆందోళనవ్యక్తం చేశారు. బుధవారం రాత్రి అయినా తమను పీహెచ్‌సీ వద్దే నిర్బంధించడం ఎంత వరకు సమంజసమని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆశ కార్యకర్తలు, జిల్లా కోశాధికారి కె.సూర్యావతి, మండలశాఖ సెక్రటరీ బి.రత్నకుమారి, కోశాధికారి బి.కామేశ్వరి, సీహెచ్ దుర్గాదేవి, పి.మంగాదేవి పాల్గొన్నారు.

ఐ.పోలవరం: విజయవాడ వెళ్తున్న 38మంది ఆశా వర్కర్లను ముమ్మిడివరం సీఐ కొండయ్య ఆధ్వర్యంలో ఎస్ఐ భానుప్రసాద్ బుధవారం అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. దీనితో ఆశా వర్కర్లు పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు.అనంతరం పోలీసులు వారిని మురమళ్ల ఆర్యవైశ్య కల్యాణ మండపానికి తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

కె.గంగవరం: 52మంది ఆశవర్కర్లను పామర్రు ఎస్ఐ జానీ బాషా అరెస్టుచేసి అదుపులోకి తీసుకున్నారు. రాత్రి వరకు పోలీసులు ఆధీనంలోనే ఉన్నారు. గురువారం ప్రతీ ఆశ కార్యకర్త విధులకు హాజరుకావాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి.

కపిలేశ్వరపురం:ఆశా కార్యకర్తలనుబుధవారం అదుపులోకి తీసుకునిఅంగర పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు. పోలీసు చర్యలకు ఆశాకార్యకర్తలు అసహనం వ్యక్తం చేశారు. రాత్రి వారిని విడుదల చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ద్రాక్షారామ: ఆశావర్కర్లను ద్రాక్షారామ పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడం పట్ల అంగన్‌వాడీ వర్కర్లు బుధవారం రాత్రి పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. రాత్రి7గంటలు దాటినా పోలీస్‌స్టేషన్‌లో ఉంచడం పట్ల అంగన్‌వాడీ సంఘ నాయకులు ఖండించారు. గురువారం ఆశావర్కర్లకు మద్దతుగా అంగన్‌వాడీలు ఆయా పోలీస్‌స్టేషన్‌ల వద్ద ధర్నా చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మేడిశెట్టి దుర్గమ్మ పిలుపు నిచ్చారు.

రామచంద్రపురం: ఆశా వర్కర్లను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించడం అన్యాయమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూకల బలరాం అన్నారు. ఆశావర్కర్ల అరెస్టును అంగన్వాడీల అసోసియేషన్ ఖండిస్తుందని అంగన్వాడీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మేడిశెట్టి దుర్గమ్మ అన్నారు.

ఆత్రేయపురం: విజయవాడ వెళ్తున్న 40 మంది ఆశా వర్కర్లను పోలీసులు అడ్డుకున్నారు. వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆశా వర్కర్ల సంఘం అధ్యక్షురాలు కొల్లి రాజేశ్వరి ఆధ్వర్యంలో అక్రమ అరెస్టుపై నిలదీశారు. ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపంలో ఆశావర్కర్లను నిర్బంధించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు ఆశాలకు సంఘీభావం తెలిపారు.

మండపేట: ఆశవర్కర్లకు పోలీసులు నోటీసులు అందించి అదుపులోకి తీసుకున్నారు. మండపేటకు చెందిన సీఐటీయూ నాయకురాలు కె.కృష్ణవేణిని బుధవారం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. మండపేట రూరల్‌లో 14మంది, అర్బన్‌లో 7గురికి పోలీసులు ముందస్తు నోటీసులు జారీచేశారు.

ఉప్పలగుప్తం: విజయవాడ వెళ్లేందుకు సిద్ధమవుతున్న ఆశావర్కర్లను పోలీసులు స్టేషన్‌కు పిలిపించివెళ్లొద్దని సూచించారు. దీంతో వారు అక్కడ ఆందోళనకు దిగారు. అమలాపురం రూరల్ సీఐ వీరబాబు ఆధ్వర్యంలో ఎస్ఐ కె.మనోహర్ జోషీ వారినిఅరెస్టుచేసి వ్యక్తిగత పూచీకత్తులు తీసుకున్నారు.

జిల్లాలో మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి



మాట్లాడుతున్న మాదిగ రాజకీయ జేఏసీ చైర్మన్ నీలకంఠం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 7: వచ్చే ఎన్నికల్లో జిల్లాలో మాదిగలకు అన్ని రాజకీయ పార్టీలు రెండు ఎమ్మెల్యే స్థానాలు, ఒక ఎంపీ సీటు కేటాయించి సామాజిక న్యాయం చేయాలని డిమాండు చేశారు. రోళ్లపాలెంలో మాజీ సర్పంచ్ నేదునూరి నతానియేలు అధ్యక్షతన మాదిగ రాజకీయ జేఏసీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. జేఏసీ చైర్మన్ చుట్టుగుళ్ల నీలకంఠం మాట్లాడుతూ జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లోనూ మాదిగ, అనుబంధ కులాల ఓటు బ్యాంకు ఉన్నప్పటికీ రాజకీయ ప్రాధాన్యం కల్పించకుండా మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాదిగలకు సీట్లు కేటాయించకపోతే వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి ఆకుమర్తి ఆశీర్వాదం, ముఖ్య సలహాదారు గంపల సత్యప్రసాద్, యార్లగడ్డ రవీంద్ర, కొల్లు సూర్యారావు, తెన్నేటి రాజబాబు, సవరపు అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

ఓఎన్జీసీ చర్యలతో జీవనోపాధి కోల్పోతున్న మత్స్యకారులు

అల్లవరం, ఫిబ్రవరి 7: సముద్ర జలాల్లో ఓఎన్జీసీ, చమురు సంస్థల కార్యకలాపాలతో కాలుష్య వ్యర్థాలు పెరిగిపోయి చేపలవేట సాగక మత్స్యకారులు జీవనోపాధి కోల్పోతున్నారని అమలాపురం తాలుకా అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెమ్మాడి సాయిబాబు ఆరోపించారు. బుధ వారం రెండు బోట్లలో మత్స్యకారులతో కలిసి ఓడలరేవు సముద్ర జలాల్లో వేటకు వెళ్లి చేపలు పడని స్థితిని ప్రయోగాత్మకంగా గుర్తించారు. వేట బోట్లకు కనీసం డీజిల్ ఖర్చులు కూడా రావడం లేదన్నారు. ఓఎన్జీసీ ప్లాట్‌ఫామ్‌ల వద్ద పైపులకు వలలు చిక్కుకుని నష్టం వాటిల్లుతోందన్నారు. సముద్రంలో చమురు వ్యర్థాలు కలిసిపోయి మత్స్య సంపదకు తీవ్ర నష్టం కలుగుతోందని ఆవేదన చెందారు. చేపల పునరుత్పత్తి స్థాయి పడిపోయిందన్నారు. ఓఎన్జీసీ, ప్రభుత్వం మత్స్యకార కుటుంబాలకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని సాయిబాబు కోరారు.



సముద్ర జలాలలో వేటాడి వచ్చిన బోట్లలో తాలుకా అగ్నికుల క్షత్రియ అధ్యక్షుడు పెమ్మాడి సాయి

దళిత ఉద్యమ నాయకుడు రాధాకృష్ణ మృతి



అమలాపురం టౌన్, ఫిబ్రవరి 7: సీనియర్ న్యాయవాది, దళిత ఉద్యమ నాయకుడు పినిపే రాధాకృష్ణ(58) బుధవారం మృతి చెందారు. ఈనెల2న భట్నవిల్లిలో జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో రాధాకృష్ణ తలకు బలమైన గాయమైంది. అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను కిమ్స్ ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలతో పాటు ఎన్నో దళిత ఉద్యమాల్లో ఆయన పాల్గొన్నారు. అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉంటున్న ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాధాకృష్ణ మృతి సమాచారం తెలుసుకున్న దళిత సంఘాల నాయకులు అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీకి చేరుకున్నారు. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావుతో పాటు దళిత సంఘాల నాయకులు డీబీ లోక్, జంగా బాబూరావు, ఎంఏకే భీమారావు తదితరులు రాధాకృష్ణ భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళుర్పించారు.

ఈవీఎంలపై అవగాహన

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 7: పట్టణంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో బుధవారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈవీఎంల వినియోగం, ఓటు వేసే విధానాన్ని రెవెన్యూ అధికారులు తెలియజేశారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. ప్రిన్సిపాల్ కె.మనోహర్, కరస్పాండెంట్ కేవీఆర్ఎస్ నరసింహారావు, కరాటం ప్రవీణ్, కె.శ్రావణ్‌దిలీప్, యాలంగి వరప్రసాద్, డాక్టర్ కె.హేమవిజిత, చంద్రపాల్ పాల్గొన్నానరు.

ఘనంగా శాంతి కల్యాణం

అంతర్వేది, ఫిబ్రవరి 7: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో బహుళద్వాదశి సందర్భంగా స్వామివారి శాంతికల్యాణాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాస కిరణ్, పెద్దింటి శ్రీనివాసాచార్యులు, స్థానాచార్యులు వి.రంగాచార్యులు సారథ్యంలో కల్యాణతంతు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శాంతి కల్యాణంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటా కాంగ్రెస్ ప్రచారం

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 7: కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పోలిశెట్టి హరిబాబు అధ్యక్షతన ఏఐసీసీ కో-ఆప్షన్ సభ్యుడు చీకట్ల అబ్బాయి ఆధ్వర్యంలో బుధవారం ఎస్.కొత్తపల్లి పంచాయతీ నల్లావారిపేటలో ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా శాఖ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, పార్లమెంటు ఇన్‌చార్జి మట్టా శివప్రసాద్, కొత్తూరు శ్రీను, అయితాబత్తుల సుభాషిణి, మహ్మద్ ఇస్మాయిల్ ఆరీఫ్, దోనిపాటి విజయలక్ష్మి, గెడ్డం సురేష్‌బాబు, ఆకుల వెంకటరెడ్డినాయుడు, నిమ్మకాయల నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

చదువులతో పాటు క్రీడలకు ప్రాధాన్యం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 7: చదువులో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యమిచ్చి ప్రోత్సహిస్తున్నట్టు నారాయణ విద్యా సంస్థల ఏజీఎం ఎన్.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. విద్యా సంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థులకు జోన్ లెవెల్‌లో క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపల్ సీహెచ్ రామచంద్రం అధ్యక్షతన విజేతలకు అభినందన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసరెడ్డి విజేతలకు షీల్డులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఫిజికల్ డైరెక్టర్ ఎస్.రెడ్డి నాయుడును ఘనంగా సత్కరించారు. కో-ఆర్డినేటర్లు గోపీ నాయుడు, నవీన్, ప్రియ, వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ సురేఖ, ఏవో మురలీకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

9న జేవీవీ సైన్స్ కళాయాత్ర

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 7: శాస్త్రీ దృక్పథ ప్రచారంలో భాగంగా ప్రజా సైన్స్ కళాయాత్రను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు జేవీవీ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఇఆర్ సుబ్రహ్మణ్యం, ఎండీ ఖ్వాజా మొహద్దీన్ తెలిపారు. శుక్రవారం అమలాపురం గడియార స్తంభం సెంటర్లో సైన్స్ నృత్య రూపకాలు, నాటికలు, మేజిక్ నిర్వహిస్తామన్నారు. కళాజాతాను విజయవంతం చేయాలని కోరారు.

శాస్త్రసాంకేతిక రంగాలపై దృష్టి సారించాలి

ఐ.పోలవరం, ఫిబ్రవరి 7: శాస్త్రసాంకేతిక రంగాలపై విద్యార్థులు దృష్టి సారించాలని ప్రముఖ ఇస్రో శాస్త్రవేత్త విష్ణువర్ధల రామూర్తి సూచించారు. ఐ.పోలవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ఆయన వైజ్ఞానిక రంగంలో అవసరమైన పరిశోధనాంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే శాస్త్రసాంకేతిక రంగాల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు గణేశ్వరరావు, పాపారావు, శాంతకుమార్, పీఎంసీ చైర్మన్ రేవు సౌరెడ్డి, నందుల ఈశ్వరరావు, ఆకుల వెంకటేశ్వరరావు, దంగుడుబియ్యం నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రాయవరం, ఫిబ్రవరి 7: రాయవరం, లొల్ల, వి.సావరం, వెదురుపాక, సోమేశ్వరం గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను నియోజకవర్గ ఎన్నికల అధికారిగా ఎల్లారావు పరిశీలించారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఉన్న సౌకర్యాలను ఆయన పరిశీలించారు. తహశీల్దారు కృపారావు, ఆర్ఐ పి.రామారావు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దారు మెహెర్ బాబా, వివిధ గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

నేషనల్ డీ వార్మింగ్‌డేపై అవగాహన సదస్సు

రామచంద్రపురం, ఫిబ్రవరి 7: స్థానిక రత్నంపేట హైస్కూల్‌లో బుధవారం సబ్‌డివిజనల్ అధికారి డా.ఎస్.ప్రశాంతి ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు, పాఠశాలల హెచ్‌ఎంలకు జాతీయ నులి పురుగుల దినోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డా. డి.హేమసుధీర్, డా. వి.స్వాతి భవాని మాట్లాడుతూ నులి పురుగుల వల్ల ఆకలి మందగిస్తుందన్నారు. అనంతరం ఎంఈవో ఎం.శ్రీనివాస్ గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 నాగేశ్వరి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

రాయవరం, ఫిబ్రవరి 7: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో 2022-23లో మండలంలో చేపట్టిన పనులపై బుధవారం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఎంపీడీవో వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అంబుడ్స్‌మెన్ ఎం.జ్యోతి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ పాల్గొని సమీక్షించారు. మండలంలో 12గ్రామాల్లో రూ.6.03కోట్లతో చేపట్టిన 1,296 పనులపై సీఆర్పీలు నిర్వహించిన ఆడిట్ నివేదికను గ్రామ సభలో డీఆర్పీలు నివేదించగా, ఈనివేదికలను అధికారులు సమీక్షించారు. 12 గ్రామాల్లో మస్తర్లల్లో కొట్టివేతలు, ఎంబుక్‌లో నమోదులో తప్పులు కారణంగా రూ.11వేల అపరాధ రుసుం విధించడంతో పాటు 2022-23లో చేపట్టిన పనుల వద్ద నేమ్ బోర్డులు ఏర్పాటు చేయని కారణంగా రూ.2.24లక్షలు సీఆర్‌డీఏ ఖాతాకు రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీవీవో కర్రి బీమేశ్వరరావు, ఏపీడీ ఎం.సత్యనారాయణ, ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సుధారాణి, జేఈ ఈశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఫీల్డ్అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

రామచంద్రపురం, ఫిబ్రవరి 7: స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ కె.సి.సత్యలత ఆధ్వర్యంలో విద్యార్థులకు రోడ్డు భద్రతా అవగాహనా సదస్సు నిర్వహించారు.రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఆర్టీవో ఆర్.రాజేంద్రప్రసాద్ అన్నారు. డా.లక్ష్మి, డా.శోభారాణి, డా.సుజాత, జి.సుశీల, డా. ఎన్.వి.రమణ, అధ్యాపకులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా విజేతలకు సన్మానం

అంతర్వేది, ఫిబ్రవరి 7: రామేశ్వరం నుంచి ఆడుదాం ఆంధ్రా వాలీబాల్ టీమ్ ఈనెల9న జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు వెళుతున్నసందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఆ టీమ్‌కు అభినందనలు తెలుపుతూ టీమ్ లీడర్‌ను సన్మానించారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎస్ఐ ఎస్.రాము, ఏపీఎం విజయ్, ఎంపీడీవో బడుగు మంగాదేవిపాల్గొన్నారు.

సూరిబాబుకు సన్మానం

అల్లవరం, ఫిబ్రవరి 7: డీసీసీ అల్లవరం బ్రాంచి నోడల్ అధికారిగా పనిచేసి ఏజీఎంగా ఉద్యోగోన్నతి పొందిన మహదశ సూరిబాబును ఘనంగా సన్మానించారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలి

అంబాజీపేట, ఫిబ్రవరి 7: ప్రకృతి వ్యవసాయంపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని కేరళ రాష్ట్ర ప్రభుత్వ ప్లానింగ్ బోర్డు సభ్యులు అనూప్ కిషోర్, కన్సేషనమస్ కంపెనీ చైర్మన్ వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం గంగలకుర్రు చిట్టావరుల బాబూరావు వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. కొబ్బరి తోటలో అంతర పంటలుగా సాగు చేస్తున్న కోకో, అరటి, జామ, పసుపు, పోక తదితర పంటలు పరిశీలించారు. ఏపీలో తొలిసారిగా రైతుల వ్యవసాయ క్షేత్రాలను సందర్శించామన్నారు. ఇక్కడి రైతులు ఆప్యాయంగా మాట్లాడటం ఆనందంగా ఉందన్నారు. వీరి వెంట ప్రకృతి వ్యవసాయ జిల్లా అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ ఎం.సత్యనారాయణ, ఏవో శ్రీనివాస్, రైతు సాధికార సంస్థ రాష్ట్ర బృందం ఎం.చందు, బి.శ్రీను, కల్పన, సిబ్బంది ఉన్నారు.

సర్పంచ్‌లను నిర్బంధించినా అసెంబ్లీని ముట్టడించాం

అంబాజీపేట, ఫిబ్రవరి 7: చలో అసెంబ్లీ ముట్టడికి ఎన్ని అడ్డంకులు వచ్చిన విజయవంతం కావడం అభినందనీయమని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా, పోలీసులతో రెండు రోజుల ముందు హౌస్ అరెస్టులు చేయించిన వాటిన్నంటిని దాటుకుని కొందరూ సర్పంచ్‌లు పార్టీలకతీతంగా చలో అసెంబ్లీకి చేరుకుని నిరసన తెలిపారన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ చరిత్రలో ఇంతవరకూ అసెంబ్లీ గేటు వద్దకు వెళ్లి నిరసన తెలిపిన మొట్టమొదటి సంఘం సర్పంచ్‌లన్నారు.

రామాలయాన్ని పునర్నిర్మాణం చేయాలి

మామిడికుదురు, ఫిబ్రవరి 7: పాశర్లపూడిలోని వైనతేయ నదీ తీరంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనుల వల్ల స్థానికంగా ఉన్న శ్రీకోదండ రామాలయం బీటలు వారిందని, ఆలయాన్ని పునర్నిర్మించాలంటూ స్థానికులు బుధవారం ఆందోళన చేశారు. బీటలు వారిన రామాలయ పరిస్థితిని అధికారులు తెలియచేసినప్పటికీ పట్టించుకోవడంలేదని ఆరోపించారు. తక్షణమే రెవెన్యూ, రైల్వే అధికారులు స్పందించి శిథిలమైన రామాలయాన్ని పునర్నిర్మించాలంటూ స్థానిక పల్లిపాలెం వాసులు ఆందోళన చేసారు.

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి దరఖాస్తు

మామిడికుదురు, ఫిబ్రవరి 7: పి.గన్నవరం ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించాలని విజయవాడలోని పార్టీ కార్యాలయంలో నగరానికి చెందిన నీతిపూడి బాలసత్యనారాయణ, బత్తుల సురేష్‌బాబు దరఖాస్తు సమర్పించారు. పార్టీ నాయకులు అప్పన రామకృష్ణ, గెడ్డం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: అంబాజీపేట మ్యారేజీ బ్యాండు
వెంకటరమణ	: బూట్‌కట్ బాలరాజు
శ్రీలలిత	: ధీర
శేఖర్ స్క్రీన్-1	: హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	: నాసామిరంగ
రమా	: గుంటూరు కారం
గణపతి	: సైంధవ్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: హనుమాన్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: గేమ్ ఆన్

శరణం... గచ్ఛామి నాటక ప్రదర్శన

అల్లవరం, ఫిబ్రవరి 7: దేవగుప్తం జడ్పీ హైస్కూల్లో భారతరత్న బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర భాగంలో సంఘం.. శరణం... గచ్ఛామి నాటకం ఆలోచింపజేసేలా సాగిందని విశ్రాంత ఐఏఎస్ అధికారి పీఎస్ఎన్ మూర్తి అన్నారు. హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ ఆధ్వ ర్యంలో జరిగిన ఈనాటక ప్రదర్శన ఆహూతులను అలరింపజేసింది. మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకట్రావు, సర్పంచ్ ఉండ్రు భగవాన్‌దాస్, దళిత నాయకులు గెడ్డం సురేష్‌బాబు, పెయ్యల పరశురాముడు, పోతుల నాగరాజు, కుడుపూడి సూర్యప్రకాశ్, బూల లోక్‌నాథ్, పోతుల నాగలక్ష్మి, తిక్కా వెంకటప్రసాద్, కుడుపూడి అప్పారావు, సాపే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎలుకల బెడద నుంచి వరి పంటను కాపాడుకోవాలి

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 7: ఎలుకల బెడద నుంచి వరి పంటను కాపాడుకునేందుకు రైతులంతా సామూహికంగా ఎలుకల నివారణ మందు పెట్టాలని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు సూచించారు. మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లాలో రైతులకు ఉచితంగా ఎలుకల నివారణ మందు పంపిణీ చేశారు. నడిపూడిలోని రైతు భరోసా కేంద్రం వద్ద సర్పంచ్ చెల్లుబోయిన వెంకటేశ్వరరావు(నాని) అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఎలుకల నివారణకు ఎరలు కట్టే విధానాన్ని వివరించి రైతులతో చేలగట్లపై నివారణా మందును ఏర్పాటు చేయించారు. వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎంఏ షంషీ, మండల వ్యవసాయాధికారి కడలి ధర్మప్రసాద్, ఏఈవో డి.ప్రేమ్‌కుమార్, ఈతకోట వెంకటప్రసాద్, బొక్కా ఆదినారాయణ, ఎ.శ్రీనివాసరావు, భైరిశెట్టి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రమాబాయి జయంతి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 7: త్యాగానికి ప్రతిరూపం మాతా రమాబాయి జీవితమని రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఎం రుషి పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్ కన్వెన్షన్ హాలులో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లాశాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి 127వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చీకరుమెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పలువురు రమాబాయి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ప్రముఖ సామాజిక కార్యకర్త, మార్పు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మోకా రాజేంద్రన్, దడాల రామకృష్ణ, బళ్ల సత్యనారాయణ, పుల్లెపు వెంకటేశ్వరరావు, మట్టా సిద్ధార్థగౌతమ్, చీకురుమెల్లి చిరంజీవి, పి.సుధీర్, డి.అంజనేయులు, ఎస్.పృథ్వీరాజ్, టి.నరసింహమూర్తి, రేవు శ్రీను, నేలపూడి రాధాకృష్ణ, పాము అంబేడ్కర్, ఎం.ఆశీర్వాదం, ఆర్పీఐ నాయకులు, అంబేడ్కర్ యువజన సంఘం, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సెక్టోరియల్ అధికారులదే కీలక పాత్ర

మామిడికుదురు, ఫిబ్రవరి 7: ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారులది కీలక పాత్ర అని తహసీల్దార్ మెరికమ్మ పేర్కొన్నారు. పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాలకు నియమితులైన సెక్టోరియల్ అధికారులు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలోని ఈవీఎంలను పరిశీలించారు. పోలింగ్ స్టేషన్‌లో సమకూర్చాల్సిన సదుపాయాల గురించి సెక్టోరియల్ అధికారులకు తహసీల్దార్ వివరించారు. డిప్యూటీ అధికారులు శరణ్య, సెక్టోరియల్ అధికారులు కె.హెలీన, ఎ.కల్యాణ్‌సూర్యకుమార్, పీవీఎస్ఎన్ రాజు, ఆర్ఐ అలీ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామచంద్రపురం, ద్రాక్షారామ, ఫిబ్రవరి7: గురువారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం వరకు చోడవరం 11కె.వి ఇండస్ట్రియల్ ఫీడర్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికేత కోసం చోడవరం, నరసాపురపుపేట, యనమదల, నరసా పురపుపేట గ్రామంలో చేపల చెరువులు, కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల, మారుతీ ట్రేడర్స్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని శాఖ ఈఈ వై.విజయానంద్ తెలిపారు.

ఆడుదాం ఆంధ్రాలో విజేతలు

మలికిపురం, ఫిబ్రవరి 7: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో కబడ్డీ పురుషుల విభాగంలో మండలం నుంచి ప్రాతినిథ్యం వహించిన శంకరగుప్తం-1 బృందం నియోజకవర్గస్థాయి పోటీల్లో విజయం సాధించింది. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపీపీ ఎంవీ సత్యవాణి, ముత్యం వీరాస్వామినాయుడు అభినందించారు.

విద్య ద్వారానే అసమానతలు రూపుమాపవచ్చు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 7: విద్య ద్వారా సమాజంలోని సాంఘిక, ఆర్థిక అసమానతలను రూపుమాపవచ్చని ప్రముఖ అంబేడ్కర్ వాది డాక్టర్ కోమలి పేర్కొన్నారు. అనాతవరంలో మాతా రమాబాయి అంబేడ్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రమాబాయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ పుణ్యమంతుల రజనీ అధ్యక్షతన జరిగిన సభలో డాక్టర్ కోమలి మాట్లాడారు. సర్పంచ్ మిమ్మితి చిరంజీవి, ప్రముఖ న్యాయవాది వడ్డి నాగేశ్వరరావు, జొన్నాడ సత్యనారాయణ, సాధనాల సత్యనారాయణ, నక్కా సర్వేశ్వరరావు, దేవరపల్లి రాజేంద్ర, పెట్టా దత్తు, కటికదల శ్రీనివాసరావు, కన్నీడి వెంకటేశ్వరరావు, జగడం రంగరాజు, సకిలే పృథ్వీ పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా ప్రశాంతి

కాట్రేనికోన, ఫిబ్రవరి 7: కాట్రేనికోన తహసీల్దార్‌గా దాసరి ప్రశాంతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కృష్ణా జిల్లా ఆర్డీవో కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

ఎన్నికల్లో విజయం సాధించాలి

పి.గన్నవరం, ఫిబ్రవరి 7: ఎన్నికల్లో విజయం సాధించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విప్పర్తి వేణుగోపాలరావు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 9న చాకలిపాలెం బాలాజీఫంక్షన్ హాల్‌లో జరిగే నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ మిథున్‌రెడ్డి హాజరవుతారన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు గన్నవరపు శ్రీనివాసరావు, బూడిద వరలక్ష్మి, మండల అధ్యక్షులు నక్కా చినసత్యనారాయణ, విత్తనాల శేఖర్, నాయకులు అడ్డగళ్ల వెంకటసాయిరాం తదితరులు పాల్గొన్నారు.

రేపు నులిపురుగుల మాత్రలు వేయాలి

అల్లవరం, ఫిబ్రవరి7: జాతీయ నులిపురుగల నివారణ మాత్రలను 19ఏళ్లలోపు అందరికీ శుక్రవారం తప్పకుండా వేయాలని ఎంపీడీవో కృష్ణమోహన్ కోరారు. బుధవారం ఆయన మండల పరిషత్ కార్యాలయం వద్ద వైద్యాధికారులు, వైద్యసిబ్బంది, ఐసీడీఎస్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. మండలంలో 11వేలమాత్రలు పంపిణీ చేస్తామన్నారు. డాక్టర్ శాంతిప్రియ, డాక్టర్ ఎస్.సుమ, ఐసీడీఎస్, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో విజేతలు

మలికిపురం, ఫిబ్రవరి 7: సీబీఎస్ఈ బోర్డు, ఐబీఎం, వన్ఎం వన్‌బీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యూచర్ టెక్ ఒలింపియాడ్‌లో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా సమాజంలోని సమస్యలను ఎలా పరిష్కరించవచ్చనే ప్రాజెక్టుకు విశ్వేశ్వరాయపురం వివేకానంద పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల కరస్పాండెంట్ పీవీవీ ప్రసాద్ తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా 1ఎం, 1బీ కోఆర్డినేటర్ కె.సాగర్, అభిరామ్ ఆధ్వర్యంలో బుధవారం విజేతలకు పతకాలు అందజేశారు.

రహదారి భద్రతపై అవగాహన

కాట్రేనికోన, ఫిబ్రవరి 7: చెయ్యేరు శ్రీశ్రీనివాసా ఇంజనీరింగు కళాశాలలో రహదారి మాసోత్సవాల సందర్భంగా బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా రవాణాశాఖాధికారి డి.అశోక్‌ప్రతాప్ రహదారి నిబంధనలపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బి.రత్నరాజు, సెక్రటరీ డీవీఎస్ఎస్ వర్మ, ట్రాన్స్‌పోర్టు విభాగాధిపతి ఎ.వెంకటరాజు పాల్గొన్నారు.

అసెంబ్లీ నియోజకవర్గాన్ని మాదిగలకు కేటాయించాలి

అంబాజీపేట, ఫిబ్రవరి 7: పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ సీటును మాదిగలకు కేటాయించాలని ఉత్తరాంధ్ర జిల్లాల బీజేపీ ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌చార్జ్ కొల్లు సూర్యారావు(సుధాకర్) కోరారు.

సహకరించిన వారికి ఎస్పీ కృతజ్ఞతలు

యానాం, ఫిబ్రవరి 7: యానాంలో శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించిన ప్రతి ఒక్కరికి యానాం ఎస్పీ రఘునాయగం కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 15నెలలు ఇక్కడ పనిచేసిన తాను బదిలీపై పుదుచ్చేరి వెళ్తున్నానని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులకు, వివిధ సంఘాల ప్రతినిధులకు, సహచార సిబ్బందికి, ప్రజలకు ప్రత్యేక ధన్యావాదలు తెలిపారు. యానాం తనకు ఎంతగానో నచ్చిందన్నారు. కార్యక్రమంలో సీఐ షణ్ముగం, ఎస్ఐ శేరు నూకరాజు, కట్టా సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ఎన్నికల అధికారిగా ఎల్లారావు

మండపేట, ఫిబ్రవరి 7:మండపేట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా జిల్లాసివిల్ సప్లయిఅధికారి డి.వివిఎస్. ఎల్లారావు బాధ్యతలు స్వీకరించారు. నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణపై స్థానిక అధికారులతో సమీక్షించారు. ఎన్నికలు ప్రజాసహకారంతో సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

గనిపోతురాజు ఆలయ ఆదాయం రూ.5.43లక్షలు

మండపేట, ఫిబ్రవరి7: కేశవరం గనిపోతురాజు ఆలయ హుండీల కానుకలను బుధవారం ఆలయ ఆవరణంలో లెక్కించారు. గత నెల నుంచి ఈనెల7 వరకు రూ.5,43,594 ఆదాయం వచ్చిందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మండపేట రూరల్ ఎస్ఐగా చైతన్యకుమార్

మండపేట, ఫిబ్రవరి 7: మండపేట రూరల్ ఎస్ఐగా చైతన్యకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అంబాజీపేట నుంచి ఆయన ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన శివకృష్ణ పి.గన్నవరం బదలీ ఆయ్యారు.

జనసేనలో చేరికలు

మలికిపురం, ఫిబ్రవరి 7: మలికిపురంలో జరిగిన జనసేన సమావేశంలో సోంపల్లికి చెందిన పలువురు యువకులు బుధవారం జనసేన పార్టీలో చేరారు. పార్టీలో చేరిన యువతను నాయకుడు బొంతు రాజేశ్వరరావు అభినందించారు. పార్టీ మండల అధ్యక్షుడు మల్లిపూడి సత్తిబాబు పాల్గొన్నారు.

వెల్లలో నివేశనా స్థలాలు పంపిణీ

ద్రాక్షారామ, ఫిబ్రవరి 7: నివేశనాస్థలాలు పంపిణీచేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. వెల్లలో నివేశనాస్థల పట్టాలు పంపిణీ చేశారు. ఎంపీపీ అంబటి భవానీ, సర్పంచ్ వి.సూరిబాబు, మాజీ సర్పంచ్ వట్టికూటి ఏసుబాబు, మాజీ ఎంపీటీసీ పాముల సురేష్‌కుమార్, పోలినాటి ప్రసాద్, తోట వీరభద్రరావు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన డైలీరేటెడ్ ఉద్యోగులు

యానాం, ఫిబ్రవరి 7: యానాంలోని వివిధ శాఖల్లో పనిచేస్తోన్న డైలీరేటెడ్ ఉద్యోగులు బుధవారం పుదుచ్చేరి యూనియన్ సభ్యులతో కలిసి సీఎం రంగసామిని కలిశారు. ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని కోరారు. ఉన్నాతాధికారులతో చర్చించి త్వరలోనే రెగ్యులర్ చేస్తామని సీఎం హామీఇచ్చారు. కార్యక్రమంలో డీపీఅండ్ ఏఆర్ సెక్రటరీ కేశవన్, పుదుచ్చేరి యూనియన్ ప్రతినిధులు సెల్వం, రాజేంద్రన్, మురుగవెల్, ఆనందరాజన్, సుమిత్ర పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 7: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా అమలాపురం ఆదిత్య డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డుప్రమాదాలను నివారించవచ్చునని ఎంవీఐ రవికుమార్ పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను రోడ్డు సేఫ్టీ ఎన్జీవో డైరెక్టర్ వాసు, ప్రిన్సిపాల్ సీహెచ్ సుబ్బారెడ్డిలు విద్యార్థులకు వివరించారు.